క్లుప్తంగా

నేడు ఉక్కు ఆస్పత్రిలో సేవలు బంద్

ఉక్కునగరం: ఉక్కు జనరల్ ఆస్పత్రిలో శనివారం సేవలు నిలిచిపోనున్నాయి. కోల్‌కతాకు చెందిన ఆర్‌జీకే ఆస్పత్రి జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారం సంఘటనకు నిరసనగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) శనివారం వైద్య సేవలు నిలిపి వేయాలని పిలుపునిచ్చింది. ఆ పిలుపు మేరకు ఆస్పత్రిలో ఓపీడీ, రక్త పరీక్షలు, స్కానింగ్‌లు నిలిచి పోతాయి. అత్యవసర కేసులను మాత్రమే క్యాజువాల్టీలో వైద్యులు చూస్తారని ఆస్పత్రి వర్గాలు తెలిపారు.

శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో..

గాజువాక: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి నిరసనగా శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో శనివారం నుంచి 24 గంటల పాటు వైద్య సేవలను నిలిపివేయనున్నట్టు ఆస్పత్రి డీజీఎం కె.బంగార్రాజు తెలిపారు. రోగులు సహకరించాలని కోరారు.

మోడేకుర్తికి గుర్తింపు



మోడేకుర్తి సత్యనారాయణకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎం.ఎం.ఎస్.ఎం విభాగం జనరల్ ఫోర్‌మెన్ మోడేకుర్తి సత్యనారాయణకు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి అభినందన పత్రం అందజేశారు. రచయిత, రేడియో, టీవీ ఆర్టిస్ట్ అయిన సత్యనారాయణ నాలుగేళ్లుగా సింహాచలం చందనోత్సవం, గిరి ప్రదక్షిణ, వైకుంఠ ఏకాదశి ఉత్సవాల్లో స్వచ్ఛందంగా మైక్ అనౌన్సర్‌గా సేవలు అందించారు. అతని సేవలను గుర్తించి ఈవో శ్రీనివాసమూర్తి సత్యనారాయణకు ప్రశంసా పత్రం అందజేశారు. కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉక్కు ఉద్యోగి మృతి



రమణమూర్తి (ఫైల్)

అగనంపూడి: అగనంపూడి నిర్వాసితకాలనీ దిబ్బపాలేనికి చెందిన ఉక్కు ఉద్యోగి తలారి రమణమూర్తి (52) గురువారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రమణమూర్తికి గురువారం రాత్రి నలతగా ఉండడంతో ఉక్కు జనరల్ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి క్లిష్టంగా మారడంతో నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహిస్తుండగా గుండెనొప్పి రావడంతో రమణమూర్తి మృతి చెందారని తెలిపారు. అందరితో కలిసి మెలిసి ఉండే రమణమూర్తి అకాల మరణంతో గ్రామంలో విషాదం అలముకుంది. పలువురు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. రమణమూర్తికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఉక్కు అధికారి కుటుంబానికి న్యాయం చేయాలి

స.హ. చట్టం ఉద్యమకర్త రామఅప్పారావు

అగనంపూడి: విధి నిర్వహణలో మృతి చెందిన ఉక్కు అధికారి కుటుంబానికి యాజమాన్యం తీరని అన్యాయం చేసిందని సమాచార హక్కు చట్టం ఉద్యమకర్త పట్టా రామ అప్పారావు ఆరోపించారు. ఆ అధికారి మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, హోంమంత్రి, రాష్ట్ర డీజీపీలకు ఫిర్యాదు చేసి రెండు మాసాలు కావస్తున్నా కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. అగనంపూడిలో ప్లకార్డుతో ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఉక్కు అధికారి తాతారావు విధులకు హాజరై నాలుగు రోజుల తర్వాత ఉక్కు విభాగం శవమై వద్ద కనిపించారన్నారు. అప్పట్లో ఉక్కు అధికారులు ప్రమాదంగా పోలీసులకు ఫిర్యాదు చేశారని, తర్వాత మాట మార్చి ఆయన కుటుబానికి రావాల్సి ఆర్థిక ప్రయోజనాలు అందించలేదన్నారు. దీంతో తాతారావు భార్య పోలీసులతో పాటు ఉక్కు అధికారులు, ఇతర మంత్రులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆయన ఆవేదన చెందారు. తక్షణమే స్పందించి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

జంక్షన్.. టెన్షన్



అస్తవ్యస్తంగా షీలానగర్ సిగ్నల్ పాయింట్

- హడలెత్తిస్తున్న కూడళ్లు
- ఆగని రోడ్డు ప్రమాదాలు

అక్కిరెడ్డిపాలెం: ఆ కూడళ్లు ప్రయాణికులను భయపెడుస్తున్నాయి. నిత్యం ఏదో ఒక ప్రమాదం జరగడంతో వాటి పేరు చెబితే టెన్షన్ పడుతున్నారు. అయినా ఆ సిగ్నల్ పాయింట్స్ వద్ద ప్రమాదాల నియంత్రణకు ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోక పోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇదీ పరిస్థితి

పాతగాజువాక, ఆటోనగర్, భెల్ సిగ్నల్ పాయింట్, విశాఖ డెయిరీ క్రాసింగ్, నాతయ్యపాలెం, అక్కిరెడ్డిపాలెం క్రాసింగ్, షీలానగర్ సిగ్నల్ పాయింట్‌లను యాక్సిడెంట్ జోన్లుగా గుర్తించారు. ఈ ప్రాంతాల్లో పలువురు ప్రమాదాల బారిన పడి విలువైన ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో పాతగాజువాక నుంచి షీలానగర్ సిగ్నల్ పాయింట్ వరకు జీరో డెత్, జీరో యాక్సిడెంట్ అనే నినాదంతో గత నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ ట్రాఫిక్ స్ట్రెచ్ మేనేజ్‌మెంట్ అనే కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారు. ఆ కార్యక్రమం అమలు లోప భూయిష్టంగా ఉండడంతో రోడ్డు ప్రమాదాలు సంభవిస్తూనే ఉన్నాయి.



నాతయ్యపాలెం రోడ్డు క్రాసింగ్ వద్ద ఢీ కొన్న లారీలు(ఫైల్)

దడ పుట్టిస్తున్న ఆటోనగర్ సిగ్నల్ పాయింట్

ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ అంటే వాహన చోదకుల్లో గుండెల్లో కంపరం పుడుతోంది. ఈ ప్రాంతంలో ఎక్కువగా రెడీమిక్స్ వాహనాలు తిరుగుతుంటాయి. వీటి వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా నియంత్రించడంలో ట్రాఫిక్ పోలీసులు విఫలమవుతున్నారని వాహన చోదకులు వాపోతున్నారు. ఇటీవల రెడీమిక్స్ వాహనం లోడుతో వెళ్తున్న భారీ వాహనాన్ని ఢీ కొట్టడంతో మెటీరియల్ రోడ్డు పై పడి ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకం ఏర్పడింది. అదే సిగ్నల్ పాయింట్ వద్ద మరో రెడీమిక్స్ లారీ ఓ కారును ఢీ కొట్టి భారీ ప్రమాదానికి కారణమైంది. అదృష్ట వశావత్తు కారులో ఉన్న వారు సురక్షితంగా బయట పడ్డారు. ఆటోనగర్‌లోని రెడీమిక్స్ పరిశ్రమల నుంచి మెటీరియల్‌తో సంబంధిత లారీలు పదుల సంఖ్యలో తిరుగుతూ ఉంటాయి. వీటికి నిర్దిష్ట సమయం లేకపోవడంతో ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది.



ఇటీవల ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద కారును ఢీ కొట్టిన రెడీమిక్స్ లారీ

అమ్మో షీలానగర్ కూడలి

షీలానగర్ సిగ్నల్ పాయింట్ అంటే వాహన చోదకులకు బెంబేలెత్తి పోతున్నారు. గస్తీ తిరుగుతున్న ఎస్ఐ వాహనాన్ని ఇటీవల సిగ్నల్ పాయింట్ వద్ద ఢీ కొట్టడం కొసమెరుపు. సీఎంఆర్ గొడౌన్ వద్ద రోడ్డుపై భారీ గోతులు, గతుకులు, అస్తవ్యస్తమైన పరిసరాలతో సిగ్నల్ పాయింట్ ప్రమాదాలకు కారణమవుతోంది.

- నాతయ్యపాలెం, అక్కిరెడ్డిపాలెం రోడ్డు క్రాసింగ్ వద్ద బీహెచ్‌పీవీ వైపు వెళ్లే మార్గంలో బొగ్గులోడుతో వెళ్తున్న భారీ లారీను వెనుక నుంచి మరో లారీ ఢీ కొట్టింది. దీంతో వెనుక లారీ క్యాబిన్‌లో ఇరుక్కొని డ్రైవర్ కాలు నుజ్జయ్యింది. వరుస ప్రమాదాలు జరుగుతున్నా ట్రాఫిక్ పోలీసులు పెద్దగా పట్టించుకోవడం లేదని వాహనచోదకులు ఆరోపిస్తున్నారు.

కొవ్వొత్తులతో వైద్యులు, ప్రజా సంఘాల నివాళి



పాతగాజువాక జంక్షన్‌లో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల సభ్యులు

గాజువాక: కోల్‌కతాలో హత్యాచారానికి గురైన జూనియర్ డాక్టర్‌కు పలు సంఘాల ప్రతినిధులు శుక్రవారం కొవ్వొత్తులతో నివాళులర్పించారు. పాతగాజువాక జంక్షన్‌లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మహాత్మా మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు జాగరపు శ్రీను మాట్లాడుతూ దేశంలో ఆడపిల్లలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రతినిధి డాక్టర్ సంపత్, డాక్టర్ మోజీ కెల్విన్, ఢిల్లీ సనపల, సురేష్‌రెడ్డి, పల్లా త్రినాథ్, కరణం బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఆస్పత్రిలో..

ఉక్కునగరం: కోల్ కతాలో జూనియర్ డాక్టర్‌పై సామూహిక హత్యాచారానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర సమితి సభ్యురాలు బూసి పరమేశ్వరి డిమాండ్ చేశారు. వైద్యుల పోరాటానికి సంఘీభావంగా ఉక్కు ఆస్పత్రి వైద్యులు, నర్సులు, మహిళా ఉద్యోగులు ఆస్పత్రి వద్ద నిరసన చేపట్టారు.



ఉక్కు ఆస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులు, నర్సులు, ఉద్యోగులు



తుంగ్లాంలోని గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వైద్యులు, గ్రామస్తులు

మహిళా నాయకులు కె. లక్ష్మి, కె. రమ్య, బి. తులసి, ఆశాదేవి పాల్గొన్నారు.

తుంగ్లాంలో..

అక్కిరెడ్డిపాలెం: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ పలువురు వైద్య విద్యార్థినులు, గ్రామ నాయకులు నిరసన తెలిపారు. తుంగ్లాంలోని బెల్ గేటు వైపు గల మహాత్మా గాంధీ విగ్రహం వద్ద గ్రామానికి చెందిన డాక్టర్ షర్మిలా రెడ్డి, డాక్టర్ స్నేహలతా రెడ్డి ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ మధుసూదన్ రావు, డాక్టర్ శ్రీనివాసరావు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గౌతు లచ్చన్న జయంతి



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ స్టాలిన్, నాయుడు తదితరులు

పెదగంట్యాడ: సర్దార్ గౌతు లచ్చన్న సేవలు మరువలేమని 72వ వార్డు కార్పొరేటర్ ఏజే స్టాలిన్ అన్నారు.గీత సహకులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చెల్లిబోయిన నాయుడు ఆధ్వర్యంలో సమతా నగర్‌లో గౌతు లచ్చన్న 115వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి గౌతు లచ్చన్న ఎంతో కృషి చేశారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం నేటితరం పాటుపడాలన్నారు.సంఘం అధ్యక్షుడు చెల్లిబోయిన నాయుడు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన సర్దార్ గౌతులచ్చన్న సేవలు చిరస్మరణీయమన్నారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నెల్లి సాధురాదు, దుంగ దేవరాజ్, నెల్లి శ్రీనివాసరావు, పితాని భాస్కర రావు, బొంతు కనకరాజు, పీత వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



గౌతు లచ్చన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ జగన్, శ్రీనివాసరావు

అగనంపూడి: సర్దార్ గౌతు లచ్చన్న జీవితం ఆదర్శనీయమని 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు అన్నారు. వార్డులోని కణితి రథాలమ్మ శెట్టి బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో లచ్చన్న జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో శెట్టి బలిజ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పోతల కృష్ణ, గెద్దాడ అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, బొండా గోవింద రాజులు, మార్పు శేషు, వడ్లపూడి ఈశ్వరరావు, అంగటి నూకరాజు, గెద్దాడ ఈశ్వరరావు, రాంబాబు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత విగ్రహం ఏర్పాటు అడ్డగింత



విగ్రహం ఏర్పాటును అడ్డుకుంటున్న స్థానికులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు న్యూపోర్టు పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న స్థలంలో టీడీపీ నేత , దివంగత నామాల పెంటయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు అతని కుమారులు శుక్రవారం ఏర్పాట్లు చేశారు. దీనిపై సమాచారం అందుకున్న స్థానికులు ఒక్కసారిగా వారికి ఎదురు తిరిగారు. ఇక్కడ విగ్రహం ఏర్పాటు చేసేందుకు నిరాకరించారు. అనుమతులు లేకుండా విగ్రహాన్ని ఎలా ఏర్పాటు చేస్తారంటూ పెంటయ్య కుమారులతో వాగ్వాదానికి దిగారు. అక్కడ నిర్మాణాన్ని తొలగింపజేశారు.



విగ్రహం ఏర్పాటుకు చేసిన సన్నాహాలు

ఆటోనగర్‌లో అభివృద్ధి పనుల పరిశీలన



ఆటోనగర్ ఎఫ్ - బ్లాక్‌లో డ్రైన్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఐలా కమిషనర్ జయచంద్ర

అక్కిరెడ్డిపాలెం: పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్‌లోని బి, డి, ఎఫ్ బ్లాక్‌లలో రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఆటోనగర్ ఐలా కమిషనర్ జయచంద్ర పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎఫ్ - బ్లాక్‌లో రోడ్డు, డ్రైన్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.2.82 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు.

డంపింగ్ యార్డ్ పరిశీలన



డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న చీఫ్ మెడికల్ ఆఫీసర్ నరేష్‌కుమార్

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు రామచంద్రనగర్ సమీపంలోని డంపింగ్ యార్డ్‌ను జీవీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ నరేష్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డ్‌కు వచ్చే చెత్తను ఎప్పటికప్పుడు కాపులుప్పాడ తరలించాలని ఆదేశించారు. అలాగే క్లోజ్‌డ్ కంపోజ్ సిస్టం పని తీరుపై ఆరా తీశారు. డంపింగ్ యార్డ్‌లో నిల్వ ఉన్న స్టిల్ట్‌ను వెంటనే తరలించాలన్నారు. ఆయన వెంట జీవీఎంసీ జోన్-6 ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్ ఉన్నారు.

డీఎస్సీలో సీఆర్పీలకు వెయిటేజీ ప్రకటించాలి

కంచరపాలెం: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న డీఎస్సీ-24లో సమగ్ర శిక్షలో పనిచేస్తున్న సీఆర్పీలకు వెయిటేజీ కల్పించాలని ఉద్యోగుల జిల్లా జేఏసీ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కంచరపాలెం బీఎస్ఆర్ భవనంలో సమగ్ర శిక్ష కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల విశాఖ జిల్లా జేఏసీ ప్రతినిధులు పి.గణపతి, లంక చైతన్య శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. బీఈడీ, టెట్ పరీక్షలు పాసై సమగ్ర శిక్షలో 12 ఏళ్లుగా చాలీచాలనీ జీతాలతో ఉద్యోగాలు చేస్తున్న సీఆర్పీలకు వెయిటేజీ ఇచ్చి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయికి ఘన నివాళి

గాజువాక: విలువలతో కూడిన రాజకీయాలు కొనసాగించిన గొప్ప నేత మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి అని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. బీజేపీ కార్యాలయంలో శుక్రవారం వాజ్‌పేయి చిత్రపటానికి ఆయన నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వి.రోహిణి, గూటూరు శంకరరావు, రంగనాయకులు, రామస్వామిపాల్గొన్నారు.



బీజేపీ కార్యాలయంలో వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

- నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు సభ్యుడు సిరసపల్లి నూకరాజు ఆధ్వర్యంలో వాజ్‌పేయి చిత్ర పటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో నాయకులు గొంతిన వరహాలు, వి.రోహిణి పాల్గొన్నారు.

పెదగంట్యాడ: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతిని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయం వద్ద బీజేపీ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వాజ్‌పేయి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ములకలపల్లి ప్రకాశ్, గొందేశి గురప్పరెడ్డి, పేర్ల సత్యారావు, యలమంచిలి అప్పలనాయుడు పాల్గొన్నారు.

బొత్సకు అభినందనల వెల్లువ



బొత్సకు అభినందనలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే తిప్పలనాగిరెడ్డి, దేవన్‌రెడ్డి, వైఎస్సార్ సీఈసీ సభ్యుడు గుడివాడ అప్పలరామ్మూర్తి

గాజువాక: ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన బొత్స సత్యనారాయణకు అభినందనలు వెల్లువెత్తాయి. గాజువాక నియోజకవర్గంలోని పలు వార్డులకు చెందిన నాయకులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బొత్స సత్యనారాయణను వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, గాజువాక పరిశీలకుడు తిప్పల దేవన్‌రెడ్డి అభినందించారు.

అగనంపూడి: గాజువాక మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొడ్డ గోవింద్ తోపాటు నాయకులు పేడాడ రమణ కుమారి, లోకనాథం, ఆడారి శ్రీను, దాకవరపు కృష్ణ తదితరులు బొత్సను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అక్కిరెడ్డిపాలెం: ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన బొత్స సత్యనారాయణను వైఎస్సార్ సీపీ సీఈసీ మెంబర్ గుడివాడ అప్పలరామ్మూర్తి కలిసి అభినందనలు తెలిపారు. శుక్రవారం బొత్సను ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఈటి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణను అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ గాజువాక అధ్యక్షుడు బొడ్డ గోవింద్

1 నుంచి ట్రాఫిక్ నిబంధనలు కఠినతరం

పెదగంట్యాడలో విస్తృత ప్రచారం

పెదగంట్యాడ: వచ్చే నెల 1 నుంచి ట్రాఫిక్ నిబంధనలు పక్కాగా అమలు చేయనున్నామని.. ఎవరు నిబంధనలు అతిక్రమించినా కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని న్యూపోర్టు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ ఉమా మహేశ్వరరెడ్డి హెచ్చరించారు. జిల్లా భద్రతా కమిటీ చైర్మన్, కలెక్టర్ హరేందిర ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖ బ్రత బాగ్చి సూచనల మేరకు నూతన ట్రాఫిక్ నిబంధనలపై శుక్రవారం మండలంలో విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపే వారితో పాటు వెనుక కూర్చున్న వారు కూడా విధిగా హెల్మెట్ ధరించాలని, బీఐఎస్ మార్క్ ఉన్న హెల్మెట్లను మాత్రమే వినియోగించాలని సూచించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారికి జరిమానా విధించడంతో పాటు మూడు నెలలు పాటు లైసెన్స్ సస్పెండ్ చేస్తామన్నారు. ట్రిపుల్ రైడింగ్ చేయవద్దన్నారు. కారు నడిపే వారు సీటు బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాన్ని నడపరాదని, ప్రభుత్వం జారీ చేసిన నంబర్ ప్లేట్లనే వినియోగించాలని స్పష్టం చేశారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని చెప్పారు. అతి వేగంగా వాహనాల నడిపే వారితో పాటు జిగ్ జాగ్ డ్రైవింగ్ , రాంగ్ రూట్లో ప్రయాణం చేయవద్దని, సిగ్నల్ జంప్ వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నో పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు నిలపరాదన్నారు. అలాగే ఎక్కువ ధ్వని వచ్చే హారన్లు వినియోగించవద్దని అవగాహన కల్పించారు.



ట్రాఫిక్ నిబంధనల ప్రచార ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న న్యూపోర్టు ట్రాఫిక్ ఏఎస్ఐ ఉమామహేశ్వరరెడ్డి

త్రిశక్తి ఆలయంలో శ్రావణమాస పూజలు



పూజలందుకుంటున్న మహాలక్ష్మి, మహాదుర్గ, మహాసరస్వతి

ఉక్కునగరం: శ్రీమహాలక్ష్మి, శ్రీమహాదుర్గ, శ్రీమహాసరస్వతిలు వెలసిన త్రిశక్తి ఆలయంలో శ్రావణమాస పూజలు వైభవంగా జరిగాయి. శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా వేకువజామున మహాదుర్గకు పంచామృతాభిషేకం చేశారు. అనంతరం మహాదుర్గాదేవికి మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. సాయంత్రం ఆలయ ప్రధానర్చకులు ఫణిశర్మ నేతృత్వంలోమహాలక్ష్మికి సామూహిక లక్ష్మీపూజ నిర్వహించారు. అమ్మవారిని రజత కవచంతో అలంకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీవారి సన్నిధిలో సహస్ర కుంకుమార్చన

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలో గల శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని మహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో సామూహిక వరలక్ష్మి వ్రత పూజలు, సహస్ర కుంకుమార్చనలు నిర్వహించారు. శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఉక్కు ఉద్యమనేత అమృతరావుకు నివాళి

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగారం ఏర్పాటు కోసం ఉద్యమం సాగించిన ఉక్కు ఉద్యమనేత తనంపల్లి అమృతరావు సేవలు చిరస్మరణీయమని ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు దాసరి త్రినాథ్, వరసాల శ్రీనివాసరావు అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా కూర్మన్నపాలెం కూడలిలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన 1282వ రోజు దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. ముందుగా అమృతరావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నిర్వాసితుల భూములు, రాష్ట్ర ప్రజల ఆస్తి విశాఖ ఉక్కు కర్మాగారం అన్నారు. సెయిల్‌లో విలీనం చేసి సొంత గనులు కేటాయిస్తే లాభాల బాటలో ఉక్కును తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో డెమక్రటిక్ స్టీల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



అమృతరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న త్రినాథ్, శ్రీనివాసరావు

ఆకట్టుకున్న కళారూపాల ప్రదర్శన

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన కళారూపాల ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకున్నాయి. స్టీల్ సీఐటీయూ కార్యాలయం ఆవరణలో ఉక్కు అభ్యుదయ కళావేదిక ఆధ్వర్యంలో ఉక్కునగరం విద్యార్థులు, గాజువాకకు చెందిన నాట్య అకాడమీ విద్యార్థులు వివిధ కళారూపాలను ప్రదర్శించారు. జీవీఎంసీ 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ గంగారావు మాట్లాడుతూ ప్రజా పోరాటాల ద్వారా ఏర్పడిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అదే ప్రజా పోరాటాల ద్వారా కాపాడుకోవడం సాధ్యపడుతుందన్నారు. పోరాట స్ఫూర్తిని ప్రజల్లో కలిగించడానికి కళారూపాలు ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు. స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్ జీఎం ఎం. మధుసూదనరావు మాట్లాడుతూ నేటి పిల్లల్లో దేశభక్తి నింపడం ద్వారా సమాజ అభివృద్ధితో పాటు కుటుంబ విలువలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో స్టీల్ సీఐటీయూ నాయకులు జె. అయోధ్య రామ్, యు. రామస్వామి, పి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కళారూపాలు ప్రదర్శిస్తున్న కళాకారులు